ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
బుధవారం 9 ఏప్రిల్ 2025

రవీ! మీకిది తగునా?

- గవర్నర్‌ను నిలదీసిన 'సుప్రీం' ● ఆ 10 బిల్లులపై కాలయాపన చట్టవిరుద్ధమని స్పష్టీకరణ ● మంత్రివర్గ నిర్ణయాలకు కట్టుబడాల్సిందే
- ప్రభుత్వానికి అడ్డుపుల్లగా ఉండకూడదు ● బిల్లులపై నిర్ణయానికి 3 నెలల గడువు ● సుప్రీంకోర్టు సంచలన తీర్పు



చెన్నై, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవికి సుప్రీంకోర్టులో తీవ్ర శరాఘాతం ఎదురైంది. రాష్ట్రప్రభుత్వం అసెంబ్లీలో రూపొందించి పంపిన పది బిల్లుల్ని ఆమోదించకుండా పెండింగ్‌లో పెట్టడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని దేశ సర్వోన్నత న్యాయస్థానం తప్పుబట్టింది. ఆయన నిర్ణయం చట్టవిరుద్ధమని తేల్చిచెప్పింది. రాష్ట్ర ప్రభుత్వం పంపిన కీలకమైన 10 బిల్లులను గవర్నర్ రవి ఆమోదం తెలపకుండా అనవసరమైన కాలయాపన చేస్తున్నారంటూ డీఎంకే ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. శాసనసభ ఆమోదించి పంపిన బిల్లులపై గవర్నర్ నిర్ణయం తీసుకునేందుకు అనువుగా గడువును కూడా నిర్దేశించాలని ఆ పిటిషన్‌లో కోరింది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తులు జస్టిస్ పార్దివాలా, జస్టిస్ మహాదేవన్‌తో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం మంగళవారం తీర్పు వెలువరించింది.

మూడు మార్గాలు...

రాజ్యాంగ చట్టం 200 సెక్షన్ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం బిల్లుల్ని ఆమోదం కోసం గవర్నర్‌కు పంపినప్పుడు ఆయనకు మూడే మార్గాలు ఉన్నాయని, వాటిని ఆమోదించడం, లేదా ఆమోదాన్ని పెండింగ్‌లో ఉంచి ప్రభుత్వం నుంచి వివరణ కోరటం, అదీ కాకుంటే చివరిగా రాష్ట్రపతి పరిశీలనకు పంపడమేనని స్పష్టం చేసింది. రాజ్యాంగ చట్టం 200 సెక్షన్ ప్రకారం తొలిసారిగా బిల్లును పంపినప్పుడు ఆ బిల్లును పెండింగ్‌లో ఉంచాలనుకుంటే, ఆ బిల్లులోని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన మీదట సవరణలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించి, బిల్లును శాసనసభకే తిప్పిపంపాలని, ఆ బిల్లును మళ్లీ శాసనసభలో ఆమోదించి పంపితే బిల్లుకు ఆమోదం తెలపడం మినహా గవర్నర్‌కు గత్యంతరం లేదని పేర్కొంది. రాజ్యాంగంలో గవర్నర్‌కు వీటో అధికారం ఉన్నట్లు ఎక్కడా పేర్కొనలేదని, బిల్లులపై నిర్ణయం తీసుకోవడంలో ఎలాంటి కాలయాపన ఉండకూడదని, రెండోసారి బిల్లును శాసనసభలో ఆమోదించి పంపితే గవర్నర్ ఆ బిల్లుపై ఆమోదం తెలపకుండా పెండింగ్‌లో ఉంచడానికి వీలులేదని పేర్కొంది. అలాగని రాష్ట్రపతి పరిశీలనకు పంపే అవకాశం కూడా లేదని, గవర్నర్ ఆమోదించాల్సిందేనని రాజ్యాంగంలో సుస్పష్టం చేసిందని న్యాయమూర్తులు పేర్కొన్నారు. ఈ అంశాలన్నింటిని పరిగణనలోకి తీసుకుంటే ప్రస్తుతం గవర్నర్ పెండింగ్‌లో ఉంచిన 10 బిల్లులను రాష్ట్రపతి పరిశీలన పేరుతో నిలిపి ఉంచడం చట్ట ప్రకారం ఘోరతప్పిదమే అవుతుందని వ్యాఖ్యానించింది.

బిల్లులపై ఆమోదానికి గడువు..

గవర్నర్లు బిల్లులపై తగు చర్యలు తీసుకునేందుకుగాను సుప్రీంకోర్టు ధర్మాసనం నిర్ణీత గడువును కూడా నిర్ణయించిది. రాజ్యాంగంలోని 200 సెక్షన్ ప్రకారం బిల్లులను గవర్నర్‌కు సమర్పించినప్పుడు ఆ బిల్లుల్ని నెల రోజులపాటు నిలిపిఉంచవచ్చు. రాష్ట్ర మంత్రివర్గం సూచనలకు వ్యతిరేకంగా బిల్లును పెండింగ్‌లో ఉంచడానికి మూడు నెలలను గడువుగా తీసుకోవచ్చు. రాష్ట్రమంత్రివర్గం నిర్ణయాలకు వ్యతిరేకంగా బిల్లులను రాష్ట్రపతి పరిశీలనకు పంపాలంటే మూడు నెలల గడువు తీసుకోవచ్చు. గవర్నర్ పునఃపరిశీలకు సమర్పించే బిల్లుల విషయలో నెల రోజులలోపున నిర్ణయం తీసుకోవాలని ధర్మాసనం స్పష్టం చేసింది.

గడువు పరిమితమే...

రాష్ట్రప్రభుత్వం పంపిన బిల్లులను ఆమోదించడానికి నిర్ణీత గడువు గురించి ఎక్కడా ప్రస్తావించకపోయినా గవర్నర్ నెలల తరబడి పెండింగ్‌లో ఉంచడానికి వీలున్నట్లు భావించకూడదన్నారు. రాజ్యాంగంలో ఇలా నిర్ణీత గడువులు సూచించని విషయాల్లో తగు నిర్ణయాన్ని అందరికీ ఆమోదయోగ్యమైన గడువులోగా తీసుకోవాలనే భావించాలన్నారు. ఈ పరిస్థితులలో గవర్నర్ బిల్లును పెండింగ్‌లో ఉంచడానికి, ఆమోదించడానికి ఒకటి నుంచి మూడు నెలలను గడువుగా నిర్ణయిస్తున్నామని ధర్మాసనం పేర్కొంది. అంతేకాకుండా గవర్నర్ ఎల్లప్పుడూ మంత్రివర్గం సూచనలను పాటించి తీరాల్సిందే నంటూ సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. పేరుకు రాష్ట్రానికి అధిపతిలా గవర్నర్ వ్యవహరిస్తున్నప్పటికీ ఆయన మంత్రివర్గ సలహాలు, సూచనలను పాటించి తనకున్న పరిమితమైన అధికారాలను మాత్రమే చెలాయించాల్సి ఉంటుందని గతంలో సుప్రీంకోర్టు ధర్మాసనాలు వెలువరించిన తీర్పులను గుర్తు చేసింది. ఈ సందర్భంగా గవర్నర్ వ్యవహారశైలిపైనా సుప్రీంకోర్టు పలు సూచనలు చేసింది.

గవర్నర్ ఎలా ప్రవర్తించాలి?

- గవర్నర్ పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి కట్టుబడి వ్యవహరించాలి.
- రాష్ట్ర ప్రభుత్వంతో రాజకీయంగా వ్యవహరించకుండా, ప్రభుత్వ సన్నిహితుడిగా, మార్గదర్శకుడిగా, తత్త్వవేత్తగా వ్యవహరించాలి.
- గవర్నర్ సమస్యలను పరిష్కరించే వ్యక్తిగా ఉండాలి. ప్రభుత్వాన్ని ఉత్తేజపరిచే శక్తిగా వ్యవహరించాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎన్నికైన ప్రభుత్వానికి అడ్డుగోడలా వ్యవహరించకూడదు.
- గవర్నర్ ఎల్లప్పుడూ రాజ్యాంగ విధులను సక్రమంగా నిర్వర్తించాలి.
- గవర్నర్ తాను చేసిన ప్రమాణస్వీకారానికి కట్టుబడి పనిచేయాలి.
- గవర్నర్ తాను తీసుకునే చర్యలు జనామోదానికి దగ్గరగా ఉన్నాయా, రాజ్యాంగం ప్రకారం ఉన్నాయా అని స్వీయపరిశీలన చేసుకోవాలి.

అంబేడ్కర్ సూక్తిని ఉటంకించిన సుప్రీం...

గవర్నర్ రవికి వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు తీర్పును వెలువరించడానికి ముందు, తీర్పునకు ముక్తాయింపు పలకడానికి ముందు ధర్మాసనం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ సూక్తిని ఉటంకించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 10 బిల్లులపై గవర్నర్ రవి తీసుకున్న చర్యలు నిబంధనల ఉల్లంఘన మాత్రమే కాదు ఘోర తదప్పిదమని చెప్పడం తప్ప తమకు మరో మార్గం లేదని ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. పాలనా వ్యవహారాల్లో గవర్నర్ అప్రమత్తంగా వ్యవహరించాలని, అడ్డంకిగా ఉండకూడదని తేల్చిచెప్పింది.ఈసందర్భంగా అంబేడ్కర్ సూక్తిని చెప్పదలిచామంటూ 'రాజ్యాంగం ఎంత ప్రయోజనకరమైనదైనా, దానిని అమలు చేసేవారు మంచివారు కాకపోతే, అది చెడ్డదే అవుతుంది' అని రాజ్యాంగంలోని వ్యాక్యాన్ని ఉటంకించింది.

ఇకపై సీఎం స్టాలినే ఛాన్సలర్...

సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుపై డీఎంకే సీనియర్ న్యాయవాది, రాజ్యసభ సభ్యుడు పి.విల్సన్ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలకు ఇకపై ముఖ్యమంత్రి ఛాన్సలర్‌గా వ్యవహరించేలా శాసనసభలో ఆమోదించిన బిల్లుకు కూడా ధర్మాసనం ఆమోదం తెలపటంతో గవర్నర్ రవి ఛాన్సలర్ పదవిని కోల్పోయారని తెలిపారు. ఇకపై ముఖ్యమంత్రి స్టాలిన్ ఛాన్సలర్‌గా పెండింగ్‌లో ఉన్న వివిధ విశ్వవిద్యాలయాల వీసీలను నియమించుకోగలుగుతారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో కేసు వేయడానికి రెండేళ్ల ముందే గవర్నర్ పలు బిల్లులను పెండింగ్‌లో ఉంచారని, ఈ 10 బిల్లులకు మళ్లీ గవర్నర్ ఆమోదంతో పనిలేదని, తనకున్న విచక్షణాధికారం సెక్షన్ 142 ప్రకారం ఆ 10 బిల్లులను ఆమోదించినట్లే భావించాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసిందన్నారు.

ఆ 10 బిల్లులు ఇవే...

- తమిళనాడు మత్స్యవిశ్వవిద్యాలయం చట్ట సవరణ బిల్లు 2020
- తమిళనాడు వెటర్నరీ విశ్వవిద్యాలయం చట్ట సవరణ బిల్లు 2020
- తమిళనాడు విశ్వవిద్యాలయాల చట్ట సవరణ బిల్లు 2022
- తమిళనాడు డాక్టర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయ చట్ట సవరణ బిల్లు 2022
- తమిళనాడు డాక్టర్ ఎంజీఆర్ వైద్యవిశ్వవిద్యాలయం(చెన్నై) చట్ట సవరణ బిల్లు 2022
- తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం చట్ట సవరణ బిల్లు 2022
- తమిళనాడు విశ్వవిద్యాలయ చట్టాలు (రెండో సవరణ) బిల్లు 2022
- తమిళ విశ్వవిద్యాలయ చట్టాల సవరణబిల్లు 2022
- తమిళనాడు మత్స్య విశ్వవిద్యాలయం చట్ట సవరణ బిల్లు 2023
- తమిళనాడు వెటర్నరీ విశ్వవిద్యాలయం చట్ట సవరణ బిల్లు 2023.

సుప్రీంకోర్టు తీర్పు చరిత్రాత్మకం

ఇది అన్ని ప్రభుత్వాలకు దక్కిన విజయం ● అసెంబ్లీలో సీఎం స్టాలిన్

అడయార్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించి పంపించిన ముసాయిదా బిల్లులను గవర్నర్ తన వద్దే సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో పెట్టుకున్నట్లయితే వాటిని ఆమోదించిన బిల్లులుగా పరిగణించాలంటూ దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు మంగళవారం ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమని, ఇది ఒక్క తమిళనాడు రాష్ట్రానికి లభించిన విజయం మాత్రమే కాదని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలదని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతున్న శాసనసభ సమావేశాల్లో భాగంగా మంగళవారం జరిగిన సభా కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ... 'సభకు ఒక సంతోషకరమైన వార్తను తెలియజేస్తున్నా. కొన్ని క్షణాల క్రితం చరిత్రాత్మక తీర్పు మన రాష్ట్రానికి అనుకూలంగా వచ్చింది. ఇదే సభలో ఏకగ్రీవంగా రూపొందించి, గవర్నర్ ఆమోదం కోసం పంపిన అనేక ముసాయిదా బిల్లులను ఆయన వెనక్కి పంపించిన సందర్భాలు అనేకం. అలాంటి బిల్లులను తిరిగి సభలో రెండోసారి ఆమోదించి మళ్లీ పంపాం. ఆ బిల్లులను సుదీర్ఘకాలంగా తన వద్దే ఉంచుకున్నారు. సాధారణంగా అసెంబ్లీ రెండోసారి పంపిన బిల్లులను గవర్నర్ ఆమోదించి తీరాలని చట్టం చెబుతోంది. అయితే గవర్నర్ మాత్రం బిల్లులను నిలుపుదల చేసే అధికారం తనకుందని వాదిస్తూ వచ్చారు. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించి వాదనలను బలంగా వినిపించాం. మన వాదనల్లో న్యాయం ఉందని పేర్కొన్న సుప్రీంకోర్టు.. సుదీర్ఘకాలంగా గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లులను ఆమోదించినట్టుగా పరిగణించాలని సంచలన తీర్పును వెలువరించింది. డీఎంకే ప్రధాన విధానాల్లో ఒకటైన రాష్ట్రంలో స్వయం పాలన - కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం వంటి అంశాలపై పోరాటం చేసింది. పోరాటం చేస్తుంది. విజయం సాధిస్తాం' అని డీఎంకే ఎమ్మెల్యేల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఆ తరువాత ప్రభుత్వ పిటిషన్‌పై వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది, రాజ్యసభ సభ్యుడు పి.వి ల్సన్‌ను తన ఛాంబర్‌లో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి ఉదయనిధి, సీనియర్ మంత్రి దురైమురుగన్ తదితరులు కూడా పాల్గొన్నారు.



సీనియర్ న్యాయవాది విల్సన్‌ను సత్కరిస్తున్న సీఎం స్టాలిన్ తదితరులు

ఈ వ్యాజ్యం ప్రజల కోసమా?... టాస్మాక్ అధికారుల కోసమా?

- కేసు విచారణలో ఉండగా సుప్రీంకెళ్తామంటారా?
- ఆ విషయం ముందుగా ఎందుకు చెప్పలేదు?
- హైకోర్టు అంటే ప్రభుత్వానికి లెక్కలేదా?
- ఇది హైకోర్టును అవమానించడమే?
- తుది విచారణ నేటితో ముగింపు
- ప్రభుత్వానికి తలంటిన హైకోర్టు
- సుప్రీంకోర్టులో స్టాలిన్ సర్కారుకు ఎదురుదెబ్బ
- టాస్మాక్ కేసు హైకోర్టులోనే తేల్చుకోవాలని స్పష్టీకరణ

ప్యారీస్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి తలంటుపోసింది. తాము పిటిషన్‌పై విచారణ చేపడుతుండగానే దానిపై సుప్రీంకోర్టుకు వెళ్లడమేంటని ప్రశ్నించింది. ఆ విషయం తాము విచారణ చేపట్టడానికి ముందుకు ఎందుకు చెప్పలేదని నిలదీసింది. అంటే హైకోర్టు అంటే ప్రభుత్వానికి లెక్కలేదా? ఇది హైకోర్టును ఉద్దేశపూర్వకంగా అవమానించడమే కదా అని కటువుగా వ్యాఖ్యానించింది. తుది విచారణ చేపడుతున్నట్లు తాము చెప్పినప్పుడు కూడా సుప్రీంకోర్టుకు వెళ్తున్నట్లు ప్రభుత్వం చెప్పకపోవడమేంటని విస్మయం వ్యక్తం చేసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ బుధవారం తుది విచారణ చేపడతామని తేల్చిచెప్పింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఎస్ఎం సుబ్రమణ్యం, జస్టిస్ కె.రాజశేఖర్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. టాస్మాక్ ప్రధాన కార్యాలయంతో పాటు పలు దుకాణాలు, వాటి కార్యాలయాల్లో గత నెల 8వ తేదీన తనిఖీలు చేపట్టిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రూ.1000 కోట్ల అవినీతి జరిగినట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. దీన్ని సవాల్ చేస్తూ టాస్మాక్ సంస్థ, రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించాయి. అయితే ఈడీ సోదాల వ్యవహారంపై హైకోర్టు ధర్మాసనం స్టే విధించింది. కానీ తదుపరి విచారణ నుంచి తప్పుకుంటున్నట్లు ధర్మాసనంలోని ఇద్దరు న్యాయమూర్తులు ప్రకటించారు. దాంతో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి.. తాజా ధర్మాసనానికి కేసు విచారణను బదిలీ చేశారు. ఆ ధర్మాసనంలో మంగళ, బుధవారాల్లో తుదివిచారణ చేపట్టనున్నట్లు 'లిస్ట్'లో ప్రకటించారు. ఆ మేరకు మంగళవారం ఉదయం పిటిషన్ విచారణకు రాగా ప్రభుత్వ న్యాయవాది కొద్దిసేపు వాయిదా వేయాలని అభ్యర్థించారు. అందుకు ధర్మాసనం అనుమతించింది. కొద్దిసేపటి తరువాత ధర్మాసనం మళ్లీ పిటిషన్‌పై విచారణ చేపట్టేందుకు సిద్ధమైంది. ఈ సమయంలో ప్రభుత్వ న్యాయవాది లేచి.. తాము సుప్రీంకోర్టును ఆశ్రయించామని, అందువల్ల విచారణను వాయిదా వేయాలని అభ్యర్థించారు. ఈ వ్యవహారశైలి పట్ల ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ పిటిషన్ ప్రజా సంక్షేమం కోసం దాఖలైందా? లేక టాస్మాక్ అధికారులను కాపాడేందుకే అని తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. న్యాయస్థానం ముందు నిజాయతీగా వుండాలని ప్రభుత్వానికి హితవు పలికింది. తాము తుది విచారణ చేపడుతున్నట్లు ముందుగానే ప్రకటించాక కూడా సుప్రీంకోర్టుకు వెళ్లినట్లు చెప్పకపోవడం పట్ల విస్మయం వ్యక్తం చేసింది. ఇందుకు ప్రభుత్వ న్యాయవాది బదులిస్తూ.. ఆదివారం రాత్రి 7 గంటలకు ఈడీ దాఖలు చేసిన కౌంటర్ కాపీ తమకు అందిందని, దాంతో ప్రభుత్వం మనసు మార్చుకుందని వివరించారు. ప్రజాస్వామ్య దేశంలో సుప్రీంకోర్టుకు ఎవరైనా వెళ్లవచ్చని,దానిని తాము తప్పు పట్టడంలేదని వ్యాఖ్యానించిన ధర్మాసనం..ఆ విషయం హైకోర్టుకు ముందుగా చెప్పకుండా ఎందుకు దాచాల్సి వచ్చిందన్నదే తమ అభ్యంతరమనిపేర్కొంది. ఆ తరువాత న్యాయవాది అభ్యర్థన మేరకు మధ్యాహ్నానికి విచారణను వాయిదావేసింది. ఈ విషయంలో జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించడంతో మళ్లీ హైకోర్టు ధర్మాసనం విచారణ చేపట్టింది. తుది విచారణను బుధవారం వింటామని స్పష్టం చేసింది.



మేం జోక్యం చేసుకోలేం: సుప్రీంకోర్టు

టాస్మాక్ కేసు విచారణను సుప్రీంకోర్టుకు గానీ, లేదా వేరే రాష్ట్రానికి గానీ బదిలీ చేయాలంటూ టాస్మాక్ సంస్థ, రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్లలో తాము జోక్యం చేసుకోలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో హైకోర్టుదే తుది నిర్ణయమని తేల్చిచెప్పింది. విచారణ సమయంలో హైకోర్టు అడిగిన వివరాలను ప్రభుత్వం అందించాల్సిందేనని పేర్కొంది. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో తమ పిటిషన్లను ఉపసంహరించుకుంటున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం, టాస్మాస్ సంస్థ పేర్కొనడంతో అందుకు సుప్రీంకోర్టు అనుమతించింది.



గోపురం కుంకుమ సంస్థల అధినేత వైవీ హరికృష్ణకు ఐకాన్ అవార్డు ప్రదానం చేస్తున్న ప్రముఖులు

లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఘనంగా ఉగాది సంబరాలు

● గోపురం హరికృష్ణకు 'ఐకాన్' అవార్డు

ప్యారీస్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా 324కె 2024-25 ఆధ్వర్యంలో విశ్వావసు నామ సంవత్సర ఉగాది సంబరాలు సోమవారం సాయంత్రం స్థానిక టి.నగర్ వెంకటరామన్ వీధిలోని పీఆర్‌సీసీ హాలులో ఘనంగా జరుపుకున్నారు. ఉగాది సెలబ్రేషన్స్ డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ లయన్ కె.కోటేశ్వర చౌదరి, కో-డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ లయన్ వి.దామోదర్ల అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలు జ్యోతి ప్రజ్వలన అనంతరం పండూరు ప్రసాదశర్మ పంచాంగ పఠనంతో ఆంధ్రుల సంప్రదాయాలకు అద్దం పడుతూ ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ గవర్నర్ టి.మురుగేశ్‌కుమార్, గౌరవ అతిథులుగా లయన్ ఆర్. సంపత్, అఖిల భారత తెలుగు సమాఖ్య అధ్యక్షుడు ప్రొఫెసర్ సీఎంకే రెడ్డి, ప్రత్యేక ఆహ్వానితులుగా వీజీఎస్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ వీఎస్ దేవదాస్, డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ ఎన్.ధనపాలన్, మాజీ కౌన్సిలర్ ఎం.కన్నన్, ఆత్మీయ అతిథిగా ప్రముఖ సినీ నటి రోహిణి తదితరులు పాల్గొన్నారు. తెలుగు ఉగాదిని పురస్కరించుకుని వ్యాపార, సామాజిక, ఆధ్యాత్మికరంగాల్లో నిష్ణాతులైన గోపురం కుంకుమ కంపెనీల అధినేత లయన్ వైవీ హరికృష్ణకు ఐకాన్ అవార్డు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. ముందుగా సభాధ్యక్షుడు కోటేశ్వర చౌదరి మాట్లాడుతూ.. ఈ నెల 14న ఉగాది జరుపుకోనున్న తమిళులకు, తెలుగువారికి శుభాకాంక్షలు తెలిపారు. 1965లో లియో క్లబ్ స్థాపించి ప్రముఖ ఏవీఎం స్టూడియో అధినేతల్లో ఒకరైన ఏవీఎం మురుగన్‌తో కలసి సమాజ సేవకు శ్రీకారం చుట్టిన వైవీ హరికృష్ణ తదనంతరం లయన్స్ క్లబ్‌లో చేరి అంకితభావంతో సమాజానికి అందిస్తున్న సేవలను కొనియాడుతూ తమ క్లబ్ తరఫున ఐకాన్ అవార్డుతో సత్కరించుకోవడం గర్వంగా ఉందన్నారు. అనంతరం అవార్డుపై స్పందించిన హరికృష్ణ మాట్లాడుతూ... విశ్వావసు నామ సంవత్సరంలో ప్రజలందరు సుఖశాంతులతో జీవించాలని, ఇలాంటి అవార్డులు బాధ్యతలను మరింత పెంచుతాయని అన్నారు. నటి రోహిణి మాట్లాడుతూ... సేవకు ప్రతిరూపం లయన్స్ క్లబ్ అని, ఆ మార్గంలో పయనిస్తూ ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి, అణగారిన వర్గాల అభ్యున్నతికి కోటేశ్వర చౌదరి బృందం అందిస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. డిస్ట్రిక్ట్ గవర్నర్ టి.మురుగేశ్ కుమార్ మాట్లాడుతూ... చెన్నైలో లక్షలాది తెలుగు కుటుంబాలు మాతృభాషను కాపాడుకుంటున్నాయని, అందులో భాగంగా తమ క్లబ్ తరఫున తెలుగు ఉగాది వేడుకలు జరుపుకోవడం సంతృప్తినిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నిర్వాహకులు ఎస్.రాజాప్రసాద్, బీఎస్ఎస్ ప్రసాద్, జి.సురేష్, రేణుప్రసాద్, ఎన్నార్డీ ప్రేమ్‌కుమార్, మన్నూరు చలపతి, ఎంవీ నారాయణ గుప్తా, బేతిరెడ్డి సురేష్ తదితరులు పాల్గొని నిర్వాహకులను అభినందించారు. ముందుగా డైలాగ్ స్టార్ ప్రవీణ్ చక్రవర్తి దర్శకత్వంలో ప్రదర్శించిన 'గోవిందుడు అందరివాడే' నృత్యరూపకం మంత్రముగ్దుల్ని చేసింది. ఉగాది పచ్చడి, పానకం, ఆంధ్ర వంటకాలు అందించి సభను విజయవంతం చేశారు.

బన్నారి అమ్మన్ ఆలయంలో వైభవంగా అగ్నిగుండ ప్రవేశం
7లో
అసెంబ్లీ నుంచి అన్నాడీఎంకే సభ్యుల వాకౌట్

సమాచార దర్శిని

11నుంచి పళని ఆలయ చెల్లింపు దర్శనం రద్దు

పెరంబూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పళని మురుగన్ ఆలయంలో ఈనెల 11 నుంచి 13వ తేది వరకు చెల్లింపు దర్శనం రద్దు చేశారు. పళని దండాయుధపాణి ఆలయంలో పంగుణి ఉత్తిర ఉత్సవాలు ఈనెల 5వ తేది ధ్వజారోహణంతో ప్రారంభం కాగా, 10 రోజులపాటు ఉత్సవాలు జరుగనున్నాయి. ఉత్సవాల్లో ప్రధానమైన ముత్తుకుమారస్వామి, వళ్లీ, దైవానై కల్యాణోత్సవం ఈనెల 11న, పంగుణి ఉత్తిర రథోత్సవం అదే రోజు సాయంత్రం 4 గంటలకు జరగనున్నాయి. ఈనెల 14వ తేదీతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఉత్సవాల సందర్భంగా పళని ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య అధికమైంది. ఈ క్రమంలో, ఈనెల 11 నుంచి 13వ తేది వరకు చెల్లింపు దర్శనం రద్దు చేస్తున్నట్లు దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్ బాబు తెలిపారు.

30న డీఎండీకే సర్వసభ్య సమావేశం

పెరంబూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): డీఎండీకే కార్యనిర్వాహక, సర్వసభ్య సమావేశాలు ఈనెల 30వ తేది ధర్మపురి జిల్లా పాలక్కోడులోని కేవీ మహల్‌లో నిర్వహించనున్నట్టు పార్టీ ప్రధాన కార్యాలయం పేర్కొంది. పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత అధ్యక్షతన జరుగనున్న సమావేశంలో, భవిష్యత్తులో తీసుకోవాల్సిన రాజకీయ నిర్ణయాలు, పార్టీ బలోపేతానికి చర్యలు, అసెంబ్లీ ఎన్నికల ప్రచారం, కూటమి ఏర్పాటు తదితరాలపై చర్చించనున్నట్లు పార్టీ పేర్కొంది.

వార్షిక పరీక్షలు ప్రారంభం

పెరంబూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 5వ తరగతి వార్షిక పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. 1-3 తరగతులకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటలు, 4, 5 తరగతులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్షలు జరుగనున్నాయి. ఈనెల 17వ తేది వరకు జరుగనున్న పరీక్షలకు సుమారు 14 లక్షల మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు పాఠశాల విద్యాశాఖ అధికారులు తెలిపారు.

తిరువణ్ణామలై ఆలయ హుండీ ఆదాయం రూ.3.79 కోట్లు

పెరంబూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై అరుణాచలేశ్వర స్వామి ఆలయంలో పంగుణి మాసం హుండీల లెక్కింపు సోమవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమై రాత్రి7గంటల వరకు జరిగింది. ఆలయాన్ని దర్శించుకున్న భక్తులు రూ.3,79,20,354 నగదు, 225 గ్రాముల బంగారం, 1,765 గ్రాముల వెండి, విదేశీ కరెన్సీలను కానుకలుగా సమర్పించినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

11నుంచి ఫొటోగ్రఫీ, వీడియో ఎడిటింగ్‌పై శిక్షణ

పెరంబూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ, వీడియో ఎడిటింగ్‌పై ఈనెల 11 నుంచి 24వ తేది వరకు శిక్షణ ఇవ్వనున్నారు. వివాహం, జన్మదిన వేడుకల్లో ఫొటోలు, వీడియోలు తీయడం, ఫొటోలు పలు డిజైన్‌లలో పొందుపరచడం, వీడియో ఎడిటింగ్ తదితరాలపై శిక్షణ ఇవ్వనున్నారు. స్థానిక ఈకాట్టుతాంగళ్‌లోని సంస్థ కార్యాలయంలో జరగనున్న శిక్షణకు హాజరయ్యే వారికి తక్కువ అద్దెతో బస వసతి కల్పించనున్నారు.వివరాలకు www.editn.inలో కానీ, నెం.8668102600లో సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5.45 గంటల వరకు సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు.

మే 9వ తేదీనే ప్లస్‌టూ పరీక్షా ఫలితాలు

పెరంబూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్లస్ టూ పబ్లిక్ పరీక్షా ఫలితాలు ఇదివరకే ప్రకటించినట్లు మే 9వ తేది విడుదల చేయనున్నామని, పరీక్షా ఫలితాలు ముందుగా విడుదల కానున్నాయని సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలు నమ్మరాదని పాఠశాల విద్యాశాఖ విజ్ఞప్తి చేసింది. ఈ విషయమై ఆ శాఖ అధికారులు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 83 కేంద్రాల్లో ప్లస్ టూ మూల్యాంకనం జరుగుతోందన్నారు. మూల్యాంకనం ముగించి మార్కులు గణించి మే 9వ తేది ఫలితాలు విడుదల చేయనున్నామని తెలిపారు. అలాగే, మే 19వ తేది ప్లస్‌వన్, టెన్త్ పరీక్షా ఫలితాలు విడుదల చేయనున్నామన్నారు. ఇంజినీరింగ్ కోర్సుల్లో అడ్మిషన్లకు మే 5వ తేది నుంచి ఆన్‌లైన్‌లో దరకాస్తు స్వీకరణ ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

మహిళా ఉద్యోగుల భద్రతకు 'అంతర్గత ఫిర్యాదు కమిటీ'

పెరంబూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పదిమందికి పైగా మహిళలు పని చేస్తున్న సంస్థల్లో 'అంతర్గత ఫిర్యాదు కమిటీ' ఏర్పాటు చేయాలని చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ జాక్డే ఆదేశాలు జారీ చేశారు. మహిళలపై జరుగుతున్న వేధింపులు అడ్డుకొనేలా రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు చేపట్టిందని, ఇందులో భాగంగా, పదిమంది మహిళలకు పైగా పనిచేస్తున్న ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, వ్యాపార, పారిశ్రామిక సంస్థలు, ఐటీ సంస్థల్లో ఈ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. కమిటీలో కనిష్ఠంగా నలుగురు సభ్యులు ఉండాలని, అందులో 50 శాతం మహిళలను నియమించాలన్నారు. మహిళలు ఫిర్యాదు చేసేలా ఫిర్యాదుల పెట్టె ఏర్పాటుచేయాలని, ఫిర్యాదులు విచారించి సత్వరం చర్యలు చేపట్టాలని, ఏడాదికి ఒకసారి ఫిర్యాదుల వివరాలను సాంఘిక సంక్షేమ శాఖకు తెలియజేయాలని సూచించారు. కమిటీలు ఏర్పాటుచేయని సంస్థల లైసెన్స్ రద్దు చేయడంతో పాటు రూ.50,000 వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. మహిళలపై జరిగే వేధింపులపై www.shebox.nic.inలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. అలాగే, 'అంతర్గత ఫిర్యాదు కమిటీ' వివరాలు సాంఘిక సంక్షేమశాఖ httpws://www.tnswd.poshicc.tn.gov.inలో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు.

10న టాస్మాక్ దుకాణాల మూసివేత

అడయార్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మహావీర్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 10న చెన్నై మహానగరంలో టాస్మాక్ దుకాణాలను మూసివేయాలని చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ ఆదేశించారు. ఈ విషయంపై మంగళవారం ఆమె ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 10వ తేదీన మహావీర్ జయంతిని పురస్కరించుకుని టాస్మాక్ యాక్ట్ 2003, (లైసెన్స్ అండ్ పర్మిషన్) 12వ నిబంధన మేరకు టాస్మాక్ మద్యం దుకాణాల్లో మద్యం విక్రయాలు జరుపరాదని పేర్కొన్నారు.

రాజ్‌భవన్ వీడండి

గవర్నర్‌గా ఉండే నైతిక హక్కు కోల్పోయారు ● డీఎంకే మిత్రపక్షాల డిమాండ్

చెన్నై, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ తీర్మానించిన బిల్లుల్ని పెండింగ్‌లో పెట్టిన వ్యవహారంలో సుప్రీంకోర్టు చేత చీవాట్లు తిన్న గవర్నర్ ఆర్‌ఎన్ రవి.. ఆ పదవిలో ఉండే నైతిక హక్కు కోల్పోయారని, తక్షణం ఆయన రాజ్‌భవన్ వీడాలని డీఎంకేతో పాటు దాని మిత్రపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. సుప్రీంకోర్టు తీర్పు వెలువడగానే ఆయా పార్టీల నేతలు వేర్వేరుగా గవర్నర్‌పై విమర్శలు కురిపించారు.



చెన్నై సచివాలయంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను కలుసుకుని ప్రజా సమస్యల పరిష్కారం దిశగా చర్చలు జరుపుతున్న సీపీఐ నేత ముత్తరసన్ ఎంపీ సెల్వరాజ్, శాసనసభ్యులు మారిముత్తు, రామచంద్రన్ తదితరులు

గవర్నర్‌కు చక్కటి గుణపాఠం

సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యవహరించిన గవర్నర్‌కు రవి చక్కటి గుణపాఠం. గవర్నర్ రవిని ఆర్‌ఎస్‌ఎస్ సంస్థ మొరటుగా, మోటు వ్యక్తిగా తయారు చేయడం వల్లే ప్రజానీకానికి, ఎన్నికైన ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేశారు. గవర్నర్ ఆర్‌ఎన్ రవి చర్యలు చట్టవ్యతిరేకమని సుప్రీంకోర్టు స్పష్టంగా పేర్కొనటంతో ఆయన పదవి నుండి తప్పుకోవటం మంచిది.

- డీపీఐ నేత తిరుమావళవన్

ఆత్మగౌరవం ఉంటే ఈ రాత్రే ఖాళీ చేయండి

సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు గవర్నర్‌కు వ్యతిరేకంగా ఉండడంతో ఆయనకు ఆత్మగౌరవం ఉంటే రాజ్‌భవన్‌ను రాత్రికి రాత్రే ఖాళీ చేయడం మంచిది. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచిన పది బిల్లులను సుప్రీంకోర్టు తన విచక్షణాధికారంతో ఆమోదం తెలిపింది. ఇక చట్ట వ్యతిరేకంగా పనిచేసిన గవర్నర్ పదవికి రాజీనామా చేసి స్వస్థలానికి బయలు దేరడమే మంచింది.

- డీఎంకే నేత ఆర్‌ఎస్ భారతి

రాజ్‌భవన్‌ను ఖాళీ చేయండి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన పది బిల్లులను పెండింగ్‌లో ఉంచి రాజ్యాంగ ధర్మాసనానికి వ్యతిరేకంగా గవర్నర్ ప్రవర్తించారని, ఆయనకంటూ ఎలాంటి వీటో అధికారులు లేవని సుప్రీంకోర్టు ధర్మాసనం సుస్పష్టమైన తీర్పు వెలువరించడంతో నైతికబాధ్యత వహించి గవర్నర్ రవి పదవికి రాజీనామా చేయాలి. రాజ్‌భవన్‌ను ఖాళీ చేసి స్వస్థలానికి బయలుదేరాలి. సుప్రీంకోర్టు తీర్పుతో గవర్నర్ పదవిలో కొనసాగే అర్హతను రవి కోల్పోయారు. వెంటనే రాజ్‌భవన్‌ను ఖాళీ చేసి వెళ్లడమే మంచిది.

- ఎండీఎంకే చీఫ్ వైగో

రాష్ట్రాల హక్కుల్ని కాపాడిన తీర్పు

ప్రతిపక్ష పార్టీలు పరిపాలిస్తున్న రాష్ట్రాలలో గవర్నర్‌ల ద్వారా ఆయా ప్రభుత్వాలలో సంక్షోభాలను సృష్టిస్తున్న కేంద్రంలోని బీజేపీ పాలకులు చక్కటి గుణపాఠం ఈ తీర్పు. గవర్నర్ రవి శాసనసభ గౌరవాన్ని మంటగలిపారు. తమిళ సంస్కృతీ సంప్రదాయాలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నారు. మొదటి నుంచి రవి గవర్నర్‌లా కాకుండా ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలాగే పనిచేశారు. ఈ తీర్పు అన్ని రాష్ట్రాలకున్న హక్కులను కంటికి రెప్పలా కాపాడుతుంది. తీర్పును మా పార్టీ స్వాగతిస్తోంది.

- సీపీఐ నేత ముత్తరసన్

బీజేపీ పాలకులకు చెంపపెట్టు

రాష్ట్ర గవర్నర్ రవికి వ్యతిరేకంగా సుప్రీం కోర్టు ధర్మాసనం వెలువరించిన తీర్పు రాజ్యాంగాన్ని నీరుగార్చేందుకు ప్రయత్నించే బీజేపీ పాలకులకు చెంపపెట్టు. గవర్నర్‌కంటూ విచక్షణాధికారులు లేవని, రాష్ట్ర మంత్రివర్గానికి లోబడే ప్రవర్తించాలని వెలువరించిన స్పష్టమైన తీర్పును కాంగ్రెస్ స్వాగతిస్తోంది. సుప్రీంకోర్టు తీర్పుతో రాజ్యాంగం పరిరక్షించ బడింది.

- టీఎన్‌సీసీ నేత సెల్వపెరుంతగై

అన్ని రాష్ట్రాలకు అనుకూలమైన తీర్పు

సుప్రీంకోర్టు ధర్మాసనం గవర్నర్ రవికి వ్యతిరేకంగా జారీ చేసిన తీర్పు అన్ని రాష్ట్రాల ప్రధాన హక్కులను పరిరక్షించే అనుకూలమైన తీర్పు. తమ ఇష్టానుసారం అధికారాలను చెలాయించే అధికారాలు ఏవీ గవర్నర్‌కు లేవని ఈ తీర్పుతో స్పష్టమైంది. ఈ తీర్పుతో రాష్ట్ర శాసనసభలో ఆమోదించిన పది బిల్లులు చట్టపరంగా అమల్లోకి వచ్చాయి. సీఎం స్టాలిన్ న్యాయపోరాటం ఘనవిజయం సాధించింది. ఈ విజయం అన్ని రాష్ట్రాల హక్కులను కాపాడుతుంది. తమిళనాడు పోరాడి మరెన్నో విజయాలు సాధిస్తుంది.

- డీఎంకే ఎంపీ కనిమొళి

ఇక వీసీల భర్తీలో జాప్యం వద్దు

విశ్వవిద్యాలయాలకు ముఖ్యమంత్రి ఛాన్సలర్‌గా వ్యవహరించే చట్ట ముసాయిదా బిల్లు సహా మొత్తం 10 బిల్లులను సుప్రీంకోర్టు తనకున్న రాజ్యాంగ చట్టం 142వ సెక్షన్ ప్రకారం ఆమోదిస్తూ తీర్పు వెలువరించడం హర్షణీయం. ఇకపై ప్రభుత్వం శాసనసభలో ఆమోదించి పంపే బిల్లులకు నెల నుంచి 3 నెలల గడువును కూడా నిర్ణయించడం ఆహ్వానించదగిన అంశం. ఈ తీర్పు రాష్ట్ర ప్రభుత్వాలకు మరింత అధికారాన్ని కల్పిస్తోంది. ఇకపై ప్రభుత్వం చేసే కీలకమైన చట్ట సవరణలను గవర్నర్ నిలిపి ఉంచే పరిస్థితులు ఉండవు. ఈ తీర్పుతో రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలకు ముఖ్యమంత్రి స్టాలిన్ ఛాన్సలర్‌గా వ్యవహరించనుండటంతో ఇకపై ఆలస్యం చేయకుండా యేళ్ల తరబడి భర్తీ కాని వీసీ పోస్టులను ఆలస్యం చేయొద్దు.

- పీఎంకే నేత డాక్టర్ రాందాస్

గవర్నర్ రాజీనామా చేయాలి

సుప్రీం కోర్టు వెలువరించిన చారిత్రక తీర్పు ప్రభుత్వం పంపిన పది బిల్లులను రాష్ట్ర ఆమోదం సాకుతో పెండింగ్‌లో ఉంచిన గవర్నర్ ఆర్‌ఎన్ రవి చర్యలు చట్ట విరుద్ధమని స్పష్టమైంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ వ్యవహారంలో సుదీర్ఘ న్యాయపోరాటం సాగించి విజయాన్ని సాధించింది. ఇక గవర్నర్ తన పదవికి రాజీనామా చేయడం చాలా మంచిది.

- సీపీఎం నేత పి.షణ్ముగం

పోలీస్ గ్రీవెన్స్‌లో 58 వినతులు



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న పోలీస్ కమిషనర్ అరుణ్

పెరంబూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెప్పేరిలోని నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో మంగళ వారం పోలీసు గ్రీవెన్స్ జరిగింది. గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్‌గా బాధ్యలు చేపట్టిన అరుణ్.. ప్రజల సమస్యలు తెలుకొనేలా ప్రతి బుధవారం గ్రీవెన్స్ నిర్వహిస్తు న్నారు. అలాగే, నగర పోలీసు శాఖ అధికారులు, పోలీసులు, ఇతర విభాగాల్లో పని చేస్తున్న వారు తమ సమస్యలు తెలిపేలా ప్రతి మంగళ వారం ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నారు. మంగళవారం నిర్వహించి శిబిరంలో ముగ్గురు సహాయ కమిషనర్లు, ముగ్గురు ఎస్‌ఐలు, ఆరుగురు సబ్ ఇన్‌స్పెక్టర్లు, 46 మంది పోలీసులు పాల్గొని, బదిలీ, క్వార్టర్స్ కేటాయింపు, వేతనం తగ్గింపు సహా పలు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. వినతి పత్రాలు పరిశీలించి సత్వరం న్యాయం చేయాలని కమిషనర్ ఆదేశించినట్లు నగర పోలీసు శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

రోడ్డు కోసం రాస్తారోకో



రాస్తారోకో చేపట్టిన స్థానికులు

వేలూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాగితపుపట్టరై మేలాన్‌డై వీధి, చెల్లియమ్మన్ ఆలయ వీధిలో రోడ్డు ధ్వంసమైంది. దుమ్ము, ధూళితో వాహనచోదకులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్ల నిర్మాణం చేపట్టాలని స్థానికులు పలుమార్లు అధికారులకు తెలిపినా స్పందించలేదని సమాచారం. ఈ నేపథ్యంలో, రోడ్డు నిర్మించాలని కోరుతూ మంగళవారం ఉదయం స్థానికులు రాస్తారోకో చేపట్టారు. సమాచారం అందుకున్న కార్పొరేషన్ అధికారులు అక్కడకు చేరుకుని ప్రజలతో చర్చించి, రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

వైభవంగా ద్రౌపది అమ్మవారి ఆలయ ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

తిరుత్తణి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణిలోని ద్రౌపది అమ్మవారి ఆలయ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ధరణి నాగపురంలోని ఈ ఆలయం ఎంతో ప్రసిద్ధిచెందింది. ఈ ఆలయానికి ప్రతిరోజు పెద్దసంఖ్యలో భక్తులు హాజరవుతుంటారు. ఆలయ ఉత్సవాలను పురస్కరించుకొని అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, అలంకరణ, దీపారాధనలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని వాహనంలో ఆశీనులను చేసి ఊరేగించారు. తమ ఇళ్ల ముందుకు వస్తున్న అమ్మవారికి భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించారు. గ్రామపెద్దలు, యువకులు ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎస్‌ఏబీఏ క్లబ్ చాంప్‌గా తమిళనాడు



తమిళనాడు జట్టుకు ట్రోఫీని బహూకరిస్తున్న నిర్వాహకులు

అడయార్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ది సౌత్ ఏషియన్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ (ఎస్‌ఏబీఏ) క్లబ్ చాంపియన్‌షిప్ 2025 బాస్కెట్ బాల్ టోర్నీ విజేతగా తమిళనాడు జట్టు నిలిచింది. స్థానిక నెహ్రూ ఇండోర్ స్టేడియంలో గత ఐదు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో తమిళనాడు, భూటాన్, శ్రీలంక, నేపాల్, మాల్దీవులు జట్లు పాల్గొన్నాయి. ఈ టోర్నీలో భూటాన్‌తో జరిగిన మ్యాచ్‌లో తమిళనాడు 107-41తో గెలుపొందింది. తర్వాత శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో 110-54, నేపాల్‌తో జరిగిన మ్యాచ్‌లో 118-44, మాల్దీవుల తో జరిగిన మ్యాచ్‌లో 106-49 స్కోరుతో విజయం సాధించి, టైటిల్ విజేతగా నిలిచింది. శ్రీలంక జట్టు రన్నరప్‌గా నిలించింది. ఈ టైటిల్ విజేతతో తమిళనాడు జట్టు ఎఫ్‌ఐబీఏ వెస్ట్ ఆసియా లీగ్ పోటీలకు అర్హత సాధించింది. ఈ పోటీలు మే నెల 2 నుంచి 8వ తేదీ వరకు లెబనాన్ దేశంలో జరుగనున్నాయి.

ఘనంగా మదర్ థెరిస్సా పాఠశాల వార్షికోత్సవం



వారికోత్సవంలో అతిథులు, నిర్వాహకులు

తిరుత్తణి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా కుమారరాజపేటలోని మదర్ థెరిస్సా మెట్రిక్యులేషన్ పాఠశాల 10వ వార్షికోత్సవం సోమవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్యఅతిథిగా శాంతకుమారి యతిరాసన్, సేవ్ ట్రస్ట్ నిర్వాహకులు ఎస్.ఏసుపాదం హాజరయ్యారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల విజేతలకు ముఖ్యఅతిథులు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు, పురప్రముఖులు పాల్గొన్నారు.

బాలికల నిజాయితీ

● భక్తుడు పోగొట్టుకున్న నగల అప్పగింత



యజమానికి నగలు అందజేస్తున్న పోలీసులు

తిరుత్తణి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి ఆలయాన్ని దర్శించుకున్న భక్తుడు పోగొట్టుకున్న నగలను ఇద్దరు బాలికలు పోలీసులకు అప్పగించి నిజాయితీ చాటుకున్నారు. చెన్నై జవహర్‌లాల్ నగర్‌కు చెందిన ఐటీ ఉద్యోగి గౌతం, కుటుంబ సభ్యులతో కలసి తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. దైవదర్శనం అనంతరం కారు పార్కింగ్ చేసిన ప్రాంతానికి వచ్చిన సమయంలో, రూ.1.50 లక్షల విలువైన నగలు కనిపించక పోవడం గమనించి ఆలయ ప్రాంగణంలోని పోలీసు అవుట్ పోస్ట్‌లో ఫిర్యాదు చేశారు. కొద్దిసేపటికి ఇద్దరు బాలికలు అవుట్ పోస్ట్‌కు వచ్చి, తమకు దొరికిన నగలు పోలీసులకు అప్పగించారు. విచారణలో వారు ఆర్కే పేటకు చెందిన పవిత్ర (12), రేణుక (7) అక్కాచెల్లెళ్లుగా తెలిసింది. విలువైన నగలు ఆశించకుండా నిజాయితీగా పోలీసులకు అప్పగించారు. వాటిని పోలీసులు గౌతమ్‌కు అందజేశారు.

నేడు కున్నూర్‌కు కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

పెరంబూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ బుధవారం కున్నూర్‌లోని వెల్లింగ్టన్ సైనిక శిక్షణ కళాశాలకు రానున్నారు. నీలగిరి జిల్లా కున్నూర్‌లోని ఈ కళాశాలలో ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నేవీ దళాల అధికారులకు శిక్షణ ఇస్తుంటారు. అలాగే, స్నేహపూర్వక దేశాల త్రిదళాల అధికారులు కూడా శిక్షణలో పాల్గొంటున్నారు. ఈ కళాశాల స్నాతకోత్సవం గురువారం జరుగనుంది. ఈ వేడుకలు కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. ఇందుకోసం ఆయన బుధవారం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో బయల్దేరి సాయంత్రం 4.25 గంటలకు కోవై సూలూరులోని వైమానికదళం కేంద్రానికి చేరుకుని, అక్కడి నుంచి రోడ్డు మార్గాన కున్నూర్ వెల్లింగ్టన్ సైనిక శిక్షణ కళాశాలకు చేరుకుంటారు. రాత్రికి అక్కడే బస చేయనున్న కేంద్ర మంత్రి, గురువారం జరిగే స్నాతకోత్సవంలో పాల్గొననున్నారు.

అన్నాడీఎంకేలో ఏ సమస్యలు లేవు

● ఎమ్మెల్యే సెంగోట్టయన్

ప్యారీస్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకేలో ఎలాంటి సమస్యలు లేవని, పార్టీ సరైన మార్గంలోనే వెళుతోందని సీనియర్ నేత, ఎమ్మెల్యే సెంగోట్టయన్ పేర్కొన్నారు. 77 ఏళ్ల సెంగోట్టయన్ 9వ సారి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన గత అన్నాడీఎంకే మంత్రివర్గంలో పలు శాఖల మంత్రిగాను, పార్టీలో కీలక పదవుల్లో కొనసాగారు. ఈ నేపథ్యంలో, ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామితో ఏర్పడిన అభిప్రాయ బేధాల కారణంగా సెంగోట్టయన్ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వచ్చారు. అంతేకాకుండా, తాజాగా ఢిల్లీకి వెళ్లిన ఆయన, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమై వార్తల్లోకెక్కారు. ఇలాంటి చర్యల వల్ల అన్నాడీఎంకేలో మళ్లీ చీలికలు ఏర్పడే అవకాశముందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ విమర్శలకు ఫుల్‌స్టాప్ పెట్టేలా సెంగోట్టయన్ మాట్లాడారు. పార్టీ భవిష్యత్తు కోసమే తాను కేంద్రమంత్రులతో భేటీ అయ్యానని, దీనిని రాజకీయంగా చూడరాదన్నారు. సహజంగా కేంద్రమంత్రులను తాను మాత్రమే కాకుండా అన్నాడీఎంకేలో ఉన్న పలు సీనియర్లు కూడా సంప్రదిస్తుంటారన్నారు. ఎంజీఆర్ పార్టీని స్థాపించినప్పటి నుంచి తాను సభ్యుడిగా కొనసాగుతున్నానని ఆయన తెలిపారు.

సోనాలికా ట్రాక్టర్ విక్రయాల్లో భారీ వృద్ధి

అడయార్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ ట్రాక్టర్స్ లిమిటెడ్‌కు చెందిన సోనాలికా ట్రాక్టర్ల విక్రయాల్లో గణనీయమైన వృద్ధిని సాధించింది. మార్చి 31న ముగిసిన గత ఆర్థిక సంవత్సరంలో మొత్తం 1,53,764 యూనిట్ల ట్రాక్టర్లను విక్రయించి 14.8శాతం వృద్ధిరేటును సాధించినట్టు ఆ కంపెనీ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ రామన్ మిట్టల్ తెలిపారు. ఇదే విషయంపై ఆయన సోమవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. భారత్‌లో కూడా టాప్ 10 బ్రాండ్లలో ఒకటిగా నిలిచిందన్నారు. తమ ట్రాక్టర్ల నాణ్యతపై రైతులకు ఉన్న విశ్వాసం, నమ్మకం వల్లే ఈ మైలురాయిని చేరుకున్నట్టు వెల్లడించారు. కాగా, తమకు పంజాబ్ రాష్ట్రంలోని హోషీపూర్‌లో వరల్డ్‌క్లాస్ ఇంటిగ్రేటెడ్ అండ్ రోటోటిక్ ట్రాక్టర్ ప్లాంట్ ఉన్నట్టు పేర్కొన్నారు.

అల్లు అర్జున్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న ఫ్యాన్స్ నిర్వాహకులు

తిరుత్తణి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ అవార్డు గ్రహీత, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ జన్మదిన వేడుకలను తమిళనాడు అల్లు అర్జున్ ఫ్యాన్స్ మంగళవారం ఘనంగా నిర్వహించారు. పళ్లిపట్టులోని వృద్ధుల శరణాలయంలో అన్నదానం చేశారు.

వక్ఫ్‌చట్టానికి వ్యతిరేకంగా డీపీఐ ధర్నా, రాస్తారోకో



చేపాక్ శివానందసాలై వద్ద ధర్నా జరుపుతున్న డీపీఐ నేత తిరుమావళవన్, పార్టీ నేతలు, కార్యకర్తలు

చెన్నై, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా డీపీఐ ఆధ్వర్యంలో స్థానిక చేపాక్ శివానందసాలైలో మంగళవారం ఉదయం ధర్నా, రాస్తారోకో జరిగాయి. ఈ ధర్నాకు డీపీఐ నేత, ఎంపీ తొల్ తిరుమావళవన్ నాయకత్వం వహించారు. డీపీఐ ప్రధాన కార్యదర్శి చిందనైసెల్వన్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్. బాలాజీ, వనయారు బాబు జిల్లా కార్యదర్శులు న్యాయవాది సారనాథ్, అప్పు, కరికాలవళవన్, సైదై జేకబ్ తదితరులు పాల్గొన్నారు. ధర్నాలో వక్ఫ్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ పెద్ద పెట్టు నినాదాలు చేశారు. ఈ ఆందోళన కారణంగా పోలీసులు శివానందసాలైని వన్‌వేని అమలు చేశారు. ధర్నా వల్ల ఆ రహదారిలో గంటకు పైగా వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

లంచం కేసులో ఇంజనీర్ అరెస్ట్



పట్టుబడిన నిర్మల్‌కుమార్

వేలూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): లంచం తీసుకున్న ఉప ఇంజనీర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. గుడియాత్తం సమీపంలో రోడ్డు పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్ లింగేశ్వరన్, బిల్లు కోసం గుడియాత్తం బీడీఓ కార్యాలయంలోని ఉప ఇంజనీర్ నిర్మల్‌కుమార్‌ను సంప్రదించారు. బిల్లు చేయాలంటే లంచం ఇవ్వాలని నిర్మల్‌కుమార్ డిమాండ్ చేయడంతో, లింగేశ్వరన్ జిల్లా అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించారు. అధికారుల సూచనల మేరకు రసాయనాలు పూసిన రూ.30 వేల నోట్లను లింగేశ్వరన్ ఇంజనీర్‌కు అందజేస్తుండగా అక్కడే మాటువేసిన అధికారులు అతన్ని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్ట్ చేశారు.

విమానంలో యువతి ఫొటో తీసిన ప్రయాణికుడు

పెరంబూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం మంగళూరు నుంచి చెన్నైకి సోమవారం అర్ధరాత్రి విమానం బయల్దేరింది. ఆకాశంలో విమానం వెళ్తున్న సమయంలో, అందులో ప్రయాణిస్తున్న కర్ణాటక రాష్ట్రానికి చెందిన గోపాలకృష్ణన్ (45) తన పక్క సీట్లో పసిబిడ్డతో ఉన్న 29 ఏళ్ల యువతిని తన సెల్‌ఫోన్‌లో ఫొటో తీసినట్లు తెలిసింది. ఈ విషయం గమనించిన యువతి, గోపాలకృష్ణన్‌ను ప్రశ్నించగా, అతను వాగ్వాదానికి దిగాడు. ఆ యువతి ఈ విషయాన్ని విమాన సిబ్బందికి తెలపగా, వారు గోపాల్‌కృష్ణన్ సెల్‌ఫోన్ తీసుకొని పరీక్షించారు. యువతి, ఆమె బిడ్డను పలు కోణాల్లో గోపాలకృష్ణన్ తీసిన ఫొటోలు ఉన్నాయి. సహచర ప్రయాణికులు గోపాలకృష్ణన్‌పై దాడి చేసేందుకు యత్నించారు. అర్ధరాత్రి 12 గంటలకు విమానం చెన్నైకి చేరుకున్న వెంటనే, విమానాశ్రయ అధికారులు గోపాలకృష్ణన్‌ను అదుపులోకి తీసుకుని విమానాశ్రయ పోలీసులకు అప్పగించారు. పసిబిడ్డ అందంగా ఉండడంతో ఫొటోలు తీశానని గోపాలకృష్ణన్ వివరణ ఇచ్చినా పోలీసులు నమ్మలేదు. కాగా, గోపాలకృష్ణన్ చెన్నై నుంచి సింగపూర్ వెళ్లేందుకు రిజర్వేషన్ చేసుకోగా, ఆయన ప్రయాణాన్ని రద్దు చేసిన పోలీసులు, అతన్ని విచారిస్తున్నారు.

ప్రాణాంతకంగా మారిన బర్త్‌డే బ్యానర్

● విద్యుదాఘాతంతో ఇద్దరు స్నేహితుల మృతి

పెరంబూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): స్నేహితుడికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపేలా బ్యానర్ కట్టేందుకు యత్నించిన ఇద్దరు యువకులు విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. ఈ ఘటన తిరువణ్ణామలై జిల్లాలో జరిగింది. తిరువణ్ణామలై అన్నానగర్‌కు చెందిన రాజా కుమారుడు లోకేష్ (16)కు ధనుష్, కన్నన్ మంచి మిత్రులు. మంగళవారం పుట్టినరోజు జరుపుకుంటున్న కన్నన్ శుభాకాంక్షలు తెలిపేలా లోకేష్, ధనుష్ బ్యానర్ రూపొందించారు. మనలూరుపేట రోడ్డు పక్కనే బ్యానర్ ఏర్పాటు చేసేందుకు ఇద్దరూ సమీపంలోని విద్యుత్ స్తంభంపైకి ఎక్కిన సమయంలో ఊహించని విధంగా విద్యుత్ వైరుకు తగిలి విద్యుదాఘాతానికి స్థలంలోనే మృతిచెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.



వేలూరు కార్పొరేషన్ పరిధిలోని 3వ వార్డు వినాయకపురంలో రూ.3.25 లక్షలతో చేపట్టిన నీటి ట్యాంక్ నిర్మాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి, 3వ మండల కమిటీ సభ్యుడు భూపాలన్, వాటర్ బోర్డు నిర్వహణ ఇంజనీర్ నిత్యానందం, అసిస్టెంట్ ఇంజనీర్ మహమ్మద్ సదాక్‌దుల్లా తదితరులు


'రెడ్‌ఫ్లవర్'లో ఓ దృశ్యం

ఆ హీరోను దృష్టిలో ఉంచుకునే స్టోరీ రాశా

● 'రెడ్ ఫ్లవర్' డైరెక్టర్

తన దర్శకత్వంలో రాబోయే 'రెడ్ ఫ్లవర్' స్టోరీ అగ్రహీరో విజయ్‌ను దృష్టిలో ఉంచుకుని రాసినట్టు ఆ చిత్ర దర్శకుడు ఆండ్రూ పాండియన్ చెప్పారు. శ్రీ కాళికాంబాల్ పిక్చర్స్ పతాకంపై విఘ్నేష్ హీరోగా నటించిన ఈ మూవీ త్వరలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్రం వివరాలను దర్శకుడు వెల్లడించారు. 'కథ రాసేసమయంలో నా మనసులో హీరో విజయ్‌ను ఊహించుకున్నా. మూడో ప్రపంచ యుద్ధం నుంచి మన దేశాన్ని రక్షించే సీక్రెట్ ఏజెంట్‌గా విజయ్ బాడీ లాంగ్వేజీ, ఎనర్జీ, పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో పాత్రను డిజైన్ చేశా. ఈ మూవీలో ఆ పాత్రను పోషించిన విఘ్నేష్‌లో కూడా అంకితభావం, అభిరుచి, దృఢ సంకల్పం, కృషి, పట్టుదల వంటి లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. ఇందులో మొత్తం 9 పోరాట సన్నివేశాలున్నాయి. 95 నిమిషాల గ్రాఫిక్స్, మూడు పాటలున్నాయి. త్వరలోనే విడుదల చేస్తాం. దీన్ని ఒక ఫ్యూచరిస్టిక్ యాక్షన్ మూవీగా తెరకెక్కించాం' అని పేర్కొన్నారు.

వారి జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చండి

నటుడు సౌందర రాజా వినతి

నమ్మాళ్వార్, నెల్ జయరామన్ వంటి మహనీయుల జీవిత చరిత్రను పాఠశాల విద్యార్థులు అభ్యసించేలా పాఠ్యాంశాల్లో చేర్చాలని నటుడు, సంఘ సేవకుడు సౌందరరాజా రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నమ్మాళ్వార్ 87 జయంతిని పురస్కరించుకుని మదురై జిల్లా ఉసిలంపట్టిలో మురుగన్ ఆలయం వద్ద తన 'మన్నుక్కుమ్ మక్కళుక్కుమ్' చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి సాధించిన 11 మంది రైతులను ఎంపిక చేసి వారికి రూ.5 వేల చొప్పున నగదు పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 'నమ్మాళ్వార్ జయంతి రోజున 11 మంది రైతులను సన్మానించడం అరుదైన గౌరవంగా భావిస్తున్నా. నమ్మాళ్వార్ కోసం ఒక మణిమండపాన్ని నిర్మించాలని కోరుతున్నా. మున్ముందు పర్యావరణంలో అనేక మార్పులు చోటు చేసుకుంటాయి. ప్రపంచం సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందినప్పటికీ రైతు బురదలో కాళ్ళు పెడితేనే బియ్యం పండుతాయి. రైతులు వ్యవసాయం ఎలా చేస్తారో నేటి యువతరానికి తెలియదు' అని పేర్కొన్నారు.



రైతులకు 'నమ్మాళ్వార్ అవార్డు'ల ప్రదానం

జూలై నుంచి 'వాడివాసల్' చిత్రీకరణ

● నిర్మాత ఎస్.థాను

తమిళ చిత్రజ్యోతి

వెట్రిమారన్ దర్శకత్వంలో సూర్య హీరోగా నటించే 'వాడివాసల్' చిత్రీకరణ త్వరలోనే ప్రారంభమవుతుందని ఆ చిత్ర నిర్మాత కలైపులి ఎస్.థాను వెల్లడించారు. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో విలేకరి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ... 'వారం క్రితం దర్శకుడు వెట్రిమారన్‌ను కలిసినపుడు 25 నిమిషాల పాటు స్టోరీని వినిపించగా, ఇక చాలు అని అన్నా. ఆ 25 నిమిషాల్లోనే అంత స్క్రీన్‌ప్లే ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఉండే తమిళ ప్రజలకు ఇది అధ్యాయంగా, సంస్కృతిగా మిగిలిపోతుంది' అని అన్నారు. కాగా, ఈ సినిమా ప్రీప్రొడక్షన్ నిర్మాణ పనులన్నీ ఇప్పటికే పూర్తికాగా, వేల్‌రాజ్ ఛాయాగ్రహణం అందించే ఈ చిత్రానికి జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించనున్నారు. తన సొంత నిర్మాణ సంస్థ వి క్రియేషన్స్ పతాకంపై భారీ బడ్జెట్‌తో నిర్మాత థాను నిర్మించనున్నారు. ఈ చిత్ర పూజా కార్యక్రమం కూడా ఎపుడో జరిగిన విషయం తెల్సిందే.


వెట్రిమారన్ - థాను - సూర్య


కీర్తి సురేష్

పెళ్లి తర్వాత గ్లామర్ డోస్ పెంచిన కీర్తి

టాలీవుడ్‌లో 'మహానటి'గా గుర్తింపు పొందిన హీరోయిన్ కీర్తిసురేష్ గత యేడాది పెళ్లిపీటలెక్కారు. పెళ్లికి ముందు సంప్రదాయబద్ధంగా నటించిన ఆమె... వివాహం తర్వాత గ్లామర్ డోస్ పెంచేశారు. ఈ ఫొటోలను చూసిన నెటిజన్లతో పాటు సినీ అభిమానులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ, నోరెళ్లబెడుతూ కామెంట్లు చేస్తున్నారు. అయినప్పటికీ ఆమె ఏమాత్రం పట్టించుకోకుండా తాను చేయదలచుకున్న పనిని చేసుకుంటూ పోతున్నారు. ఈ క్రమంలో తాజాగా బ్లాక్ డ్రెస్‌లో అందాలను ఒలకబోస్తూ దిగిన ఫొటోలను తన ఇన్‌స్టా ఖాతాలో షేర్ చేశారు. పెళ్లి తర్వాత ఎక్స్‌పోజింగ్ విషయంలో కీర్తిసురేష్ ప్రదర్శిస్తున్న ధైర్యసాహసాలను చూసి పలువురు హీరోయిన్లు విస్మయం చెందుతున్నారు. కాగా, బాలీవుడ్ నటుడు వరుణ్ ధావన్‌తో కలిసి కీర్తిసురేష్ నటించిన 'బేబీ జాన్' బాక్సాఫీస్ వద్ద బోల్తాపడిన విషయం తెల్సిందే. ప్రస్తుతం రణ్‌బీర్ కపూర్ సరసన నటించేందుకు ఆమె సమ్మతం తెలిపారు.

కనుల పండువగా కాశీవిశ్వనాథర్, ఉలగమ్మన్ కల్యాణం


కల్యాణోత్సవ వేదికపై కాశీవిశ్వనాథర్, ఉలగమ్మన్

చెన్నై, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశిలోని సుప్రసిద్ధ శైవక్షేత్రం కాశీ విశ్వనాథర్ ఆలయంలో సోమవారం రాత్రి కాశీవిశ్వనాథర్, ఉలగమ్మన్ తిరుకల్యాణోత్సవం వేలాదిమంది భక్తుల సమక్షంలో కనులపండువగా జరిగింది. ఈ ఆలయ మహాకుంభాభిషేక వేడుకల్లో భాగంగా ఆదిదంపతుల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్వాలంకరణశోభితంగా కాశీవిశ్వనాథస్వామి, ఉలగమ్మన్ సప్పరంలో బయలుదేరి కల్యాణవేదికకు చేరుకున్నారు. ఆ తర్వాత వేదపండితులు మంత్రోచ్చాటనలు, మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రధానార్చకులు మాంగళ్యధారణ కావించారు. ఈ వేడుకలు ఆలయ అంతర ప్రాకారంలోనే వేలాది మంది భక్తులు సమక్షంలో నిర్వహించడం విశేషం. కల్యాణోత్సవం తర్వాత ఆదిదంపతులు సప్పరంలో బయలుదేరి మాడవీధుల్లో ఊరేగి భక్తులను అనుగ్రహించారు. దారి పొడవునా భక్తులు కర్పూరనీరాజనాలు సమర్పించారు. ఆదిదంపతుల ఊరేగింపును పురస్కరించుకుని మాడవీధులను మహిళలు రంగవల్లులతో తీర్చిదిద్దారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ వల్లం బాలకృష్ణన్, సభ్యులు, అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు






సరస్వతీదేవి అలంకారంలో బన్నారియమ్మన్. అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న ఆలయ ప్రధాన పూజారి - అగ్నిగుండంపై నడిచి వెళుతున్న యువతులు

బన్నారి అమ్మన్ ఆలయంలో వైభవంగా అగ్నిగుండ ప్రవేశ వేడుకలు

చెన్నై, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా సత్యమంగళం మైసూరు రహదారిలో దట్టమైన అటవీ ప్రాంతంలో కొలువై ఉన్న బన్నారి అమ్మన్ ఆలయంలో అగ్ని గుండ ప్రవేశ వేడుకలు మంగళవారం వేకువజామున జరిగాయి. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ వంటి పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వేలసంఖ్యలో తరలివచ్చారు. ఈ ఆలయ వార్షిక అగ్నిగుండ ప్రవేశ వేడుకలు గతనెల 24 రాత్రి ప్రారంభమయ్యాయి. ఆ తర్వాత బన్నారియమ్మన్, సరుగు మారియమ్మన్ సప్పరాలపై ఊరేగి భక్తులను అనుగ్రహించారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి అగ్నిగుండానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం వేకువజాము 3గంటలకు మేళతాళాలతో తీర్థకొలను వద్దకు వెళ్లి బన్నారియమ్మన్, సరగు మారియమ్మన్ తోడ్కొని వచ్చే కార్యక్రమం నిర్వహించారు. చిక్కరసంపాళయం ఇక్కరై నగముం పుదూరు, వెళ్ళియంపాళయం గ్రామాల పెద్దలు 15 అడుగుల పొడవు, 10 అడుగులు వెడల్పు అగ్నిగుండంలో కట్టెలు పూర్తిగా కాలి కణకణ మండేలా సిద్ధం చేశారు. అటు పిమ్మట గుండం చుట్టూ పూలు చల్లి, కర్పూరం వెలిగించి ప్రత్యేక పూజలు జరిపారు. వేకువజాము 4 గంటలకు ఆలయ ప్రధాన పూజారి అగ్నిగుండంపై నెమ్మదిగా నడుచుకుంటూ వెళ్లారు. ఆయన వెంటే భక్తులు పిల్లా పాపలతో 'బన్నారియమ్మా కాపాడవమ్మా' అంటూ భక్తిపూర్వకంగా నినాదాలు చేస్తూ అగ్నిగుండంపై నడుచుకుంటూ వెళ్లారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటల దాకా నిర్విరామంగా భక్తులు అగ్నిగుండంపై నడిచి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈ వేడుకలకు అగ్నిమాపక దళం సభ్యులు పటిష్ఠ రక్షణ ఏర్పాట్లు చేపట్టారు. సుమారు 3 వేలమంది పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. అగ్ని గుండ ప్రవేశ వేడుకల సందర్భంగా బన్నారియమ్మన్ సరస్వతీదేవి అలంకారంతో కొలువుదీరి భక్తులను అనుగ్రహించారు.

వినో సుప్రజకు గ్లోబల్ ఫ్యాషన్ అవార్డు

చెన్నై, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వందవాసికి చెందిన ప్రముఖ డిజైనర్ వినో సుప్రజకు బ్రిటిష్ పార్లమెంట్‌లో హౌస్ ఆఫ్ కామన్స్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో గ్లోబల్ ఫ్యాషన్ ట్రయల్ బ్లేజర్ అవార్డును ప్రదానం చేశారు. ప్రపంచ తమిళ సంఘం, యుకే ప్రభుత్వం సంయుక్తంగా ఈ అవార్డుతో ఆమెను సత్కరించాయి. ఈ వేడుకల్లో బ్రిటిష్ ఎంపీలు రోటేరియన్ నోహలా, రొటేరియన్ ఉమా కుమరన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు మాట్లాడుతూ వినో సుప్రజ ప్రజలకు సామాజిక సేవలందించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే డిజైనర్ అని కొనియాడారు. ఈ సభలో వినో సుప్రజ 'పురిసై తెరుకూత్తు' (తమిళ ప్రాచీన వీధి భాగోతం) విశేషాలను వివరించారు.


అవార్డుతో వినో సుప్రజ




రాజధాని కళాశాల, రాణీ మేరి కళాశాలకు చెందిన విజేతలకు బహుమతులు అందజేస్తున్న తూమాటి సంజీవరావు

వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

చెన్నై, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): 'చెన్నపురి తెలుగు అకాడమీ' ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు మంగళవారం గ్రంథాలను బహూకరించారు. కావలికి చెందిన 'జవహర్ భారతి' కళాశాలలో తెలుగు ఉపన్యాసకుడిగా పని చేసిన సాహితీవేత్త వి.చెంచయ్య రాసిన 'సి.పి.బ్రౌన్ - మరో చూపు' లఘు పుస్తకాన్ని 'రాజధాని కళాశాల', 'డి.ఆర్.బి.సి.సి.సి హిందూ కళాశాల', 'రాణి మేరీ కళాశాల' తెలుగు విద్యార్థులకు అందజేసిన చెన్నపురి తెలుగు అకాడమీ.. గత ఫిబ్రవరిలో 'అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం' సందర్భంగా వారికి వ్యాసరచన నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ పోటీలో రాజధాని కళాశాల నుంచి ఎ.గ్రేస్, ఎం.ప్రేమావతి, ఎం.మాధవి-వి.శోభారాణి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు ఎంపికయ్యారు. రాణీ మేరి కళాశాల నుంచి డి.లావణ్య, ఎ.అశ్విని, బండి నాగప్రసన్నాంజలి-బి.సుధ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు ఎంపికయ్యారు. వారికి అకాడమీ మేనేజింగ్ ట్రస్టీ తూమాటి సంజీవరావు తదితరులు గ్రంథాలను బహూకరించారు.

అసెంబ్లీ నుంచి అన్నాడీఎంకే సభ్యుల వాకౌట్

● మీ ఆర్భాటం మరో తొమ్మిది నెలలే ● ప్రభుత్వంపై ఈపీఎస్ ధ్వజం

ప్యారీస్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రధాన ప్రతిపక్ష సభ్యులకు ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు అవకాశం కల్పించని కారణంగా అన్నాడీఎంకే సభ్యులు మంగళవారం సభ నుంచి వాకౌట్ చేశారు. రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మార్చి 14న ప్రారంభం కాగా, ఆ రోజు ఆర్థిక బడ్జెట్, మరుసటిరోజు వ్యవసాయ బడ్జెట్ దాఖలు చేశారు. 17వ తేది నుంచి బడ్జెట్‌పై ప్రారంభమైన చర్చలు వారం రోజులు కొనసాగాయి. ఆ తర్వాత శాఖలకు సంబంధించిన పద్దులపై జరిగిన చర్చల్లో సభ్యులందరు పాల్గొనగా, వారు అడిగిన ప్రశ్నలకు సంబంధిత శాఖల మంత్రులు సమాధానాలు చెప్పారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో అధికార డీఎంకే - ప్రతిపక్ష అన్నాడీఎంకే సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. అన్నాడీఎంకే సభ్యులు పలుమార్లు సభ నుంచి వాకౌట్ చేశారు. ఇదే క్రమంలో మంగళవారం కూడా నల్లచొక్కాలతో అసెంబ్లీకి హాజరైన సభ్యులు, తాము మాట్లాడేందుకు అవకాశం కల్పించలేదని స్పీకర్ అప్పావును తప్పుపడుతూ వాకౌట్ చేశారు.

మీ ఆర్భాటం 9 నెలలే: ఈపీఎస్

సచివాలయం ప్రాంగణంలో ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామి మీడియాతో మాట్లాడుతూ... 2021వ సంవత్సరం అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే అసెంబ్లీ సమావేశాల్లో సభ్యులందరూ మాట్లాడేందుకు అవకాశం కల్పించడంతో పాటు ప్రత్యక్ష ప్రసారం కూడా చేస్తామని డీఎంకే హామీ ఇచ్చిందని అయితే, ఈ నాలుగేళ్లలో అది జరగలేదన్నారు. సభ నిబంధనల ప్రకారం ప్రజా సమస్యల గురించి అసెంబ్లీలో ప్రస్తావించేందుకు ప్రధాన ప్రతిపక్షానికి ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ఇతర పార్టీలకు కూడా అవకాశం కల్పించాలని అయితే, స్పీకర్ అప్పావు మాత్రం అన్నాడీఎంకేకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారన్నారు. జీరో అవర్‌లో కూడా ప్రశ్నలు అడిగేందుకు అనుమతించడం లేదని ఆరోపించారు.ముఖ్యంగా, ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో సావధాన తీర్మానంలో పాల్గొన్న తమ పార్టీ ఎమ్మెల్యేలు సి.విజయ్ భాస్కర్, అగ్రి కృష్ణమూర్తి మాటలను ప్రత్యక్ష ప్రసారం చేయకుండా స్పీకర్ అడ్డుకున్నారన్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్, మంత్రులు,డీఎంకే మిత్రపక్షాల సభ్యులు మాట్లాడడం మాత్రమే ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నారని ఆరోపించారు. గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో సభా హక్కులు గౌరవిస్తూ అసెంబ్లీలో సభ్యులందరూ మాట్లాడేందుకు అవకాశం కల్పించామని గుర్తు చేశారు.అలాగే వారు పాల్గొన్న చర్చలను కూడా ప్రత్యక్ష ప్రసారం చేశామన్నారు. డీఎంకే ప్రభుత్వం అధికారంలో ఉండబోయేది కేవలం తొమ్మిది నెలలు మాత్రమేనని, ఆ తర్వాత డీఎంకేకు ప్రతిపక్ష హోదా కూడా దక్కదని ఈపీఎస్ జోస్యం చెప్పారు.


అసెంబ్లీ నుంచి అన్నాడీఎంకే సభ్యులతో కలిసి వాకౌట్ చేస్తున్న ప్రతిపక్షనేత ఎడప్పాడి పళనిస్వామి


పళని గిరిప్రదక్షిణ మార్గంలో నోటికి శూలాలు గుచ్చుకుని పాదయాత్రగా వస్తున్న భక్తులు


కావళ్లను మోస్తూ, నృత్యం చేస్తూ వస్తున్న భక్తులు

పళని ఆలయానికి తీర్థకావళ్లతో పోటెత్తిన భక్తులు

చెన్నై, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మురుగప్పెరుమాన్ తృతీయ దివ్యక్షేత్రం పళని దండాయుధపాణి స్వామివారి ఆలయంలో పంగుణి ఉత్సవాలను పురస్కరించుకుని రాష్ట్రం నలమూలల నుంచి భక్తులు తీర్థకావళ్లతో తరలివస్తున్నారు. పంగుణి ఉత్సవాలు ఈ నెల 5న తిరుఆవినన్‌కుడి ఆలయంలో ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. 10న తిరుకళ్యాణం, 11న పంగుణి ఉత్తిర మహారథోత్సవం జరగనున్నాయి. ఈరోడ్ జిల్లా కొడుముడి కావేరీ నదీ తీరం నుంచి తీర్థ కావళ్లతో అధిక సంఖ్యలో భక్తులు తరలిరావటంతో గిరి ప్రదక్షిణ మార్గంలో రద్దీ విపరీతంగా పెరిగింది. ఈ భక్తులను పర్వతాలయంలో రూ.300 ప్రత్యేక దర్శనం మార్గంలో ఉచితంగా అనుమతిస్తున్నారు. ఇక పంగుణి ఉత్తిరం వేడుకలకు ఇక రెండు రోజులే మిగిలి ఉండటంతో భక్తుల కోసం టన్నుల కొద్దీ పంచామృతం తయారీ పనులు కూడా చురుకుగా సాగుతున్నాయి.

మైలాపూరు కపాలేశ్వరాలయానికి రూ.1.50 కోట్లతో రజత కవచ గజ వాహనం

● అందజేసిన మంత్రి శేఖర్‌బాబు

చెన్నై, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో మైలాపూరులోని సుప్రసిద్ధ శైవాలయం కపాలేశ్వరాలయం కోసం రూ.1.50 కోట్లతో రూపొందించిన రజత కవచ గజవాహనం, అంబారీని ఆ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు మంగళవారం ఉదయం ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఆలయ నిర్వాహకుల కోరిక మేరకు ముఖ్యమంత్రి స్టాలిన్ ఉత్తర్వుల ప్రకారం ఈ గజవాహనాన్ని 156 కిలోల వెండిని ఉపయోగించి శిల్పుల ద్వారా నగిషీ పనులు చేయించి తయారు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యుడు డి.వేలు, ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులు పి.తిరునావుక్కరసు, సీటీ ఆరుముగం, డిప్యూటీ కమిషనర్ కే.వెనితా తదితరులు పాల్గొన్నారు.


రజత కవచ గజవాహనాన్ని ఆలయ నిర్వాహకులకు అందజేస్తున్న మంత్రి పీకే శేఖర్‌బాబు



నచ్చే కథలు వస్తే మళ్లీ నటిస్తా

● హీరోయిన్ రంభ

'నచ్చే కథలు వస్తే తప్పకుండా మళ్లీ సినిమాల్లో నటిస్తా' అని క్లారిటీ ఇచ్చారు నటి రంభ. పెళ్లిరోజు సందర్భంగా భర్త ఇంద్రకుమార్ పద్మనాథన్‌తో కలిసి మంగళవారం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని ఆమె దర్శించుకున్నారు. అనంతరం ఆమె ఆలయం ముందు మీడియాతో మాటాడుతూ, వివాహమై 15 ఏళ్లైన సందర్భంగా శ్రీవారి ఆశీస్సులు తీసుకునేందుకు వచ్చామన్నారు. 'సినిమాల్లోనే పుట్టిపెరిగాం. సినిమానే జీవితం. మంచి పాత్రలు వస్తే తప్పకుండా నటిస్తాను' అని రంభ చెప్పారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమలలో రవిశాస్త్రి

తిరుమల, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. క్రికెటర్ రవిశాస్త్రి, రేమాండ్స్ గ్రూప్స్ సీఎండీ గౌతమ్ హరి సింఘానియా, టీడీపీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, భారతీయ మాస్టర్ హ్యాండ్లూమ్ డిజైనర్ పద్మశ్రీ గజం అంజయ్య, ఫైర్ సర్వీస్, సివిల్ డిఫెన్స్ డీజీ వివేక్ శ్రీవాత్సవ ఉన్నారు.

గౌతమ్ హరి సింఘానియా, రవిశాస్త్రి ←




సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 8 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం : రూ.4.16 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 66,503

తలనీలాలు సమర్పించినవారు : 23,941



పేదల సొంతింటి కల భగ్నం


- వైసీపీ హయాంలో మంజూరైన 65 వేల ఇళ్లలో పూర్తయింది 26 వేలే
- పునాదుల దశ దాటని 22 వేల ఇళ్లు
- 574 లే అవుట్లలో ఒక్కటీ పూర్తి కాని వైనం
- ఎక్కడా కనిపించని మౌలిక వసతులు



తిరుపతి జిల్లాలో వేలాది మంది పేదల సొంతింటి కలను గత వైసీపీ ప్రభుత్వం భగ్నం చేసింది. ఐదేళ్లలో సుమారు 65 వేల ఇళ్లు మంజూరు కాగా అందులో 26 వేలు మాత్రమే నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. మరో 22 వేలు పునాదుల దశ దాటలేదు. తొమ్మిది వేల ఇళ్ల నిర్మాణం మొదలే కాలేదు. మిగిలినవి వివిధ దశల్లో ఆగిపోయి ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 574 లే అవుట్లను ఏర్పాటు చేయాల్సి ఉండగా కనీసం ఒక్కటంటే ఒక్కటీ పూర్తి కాలేదు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఊరందూరులో నాటి సీఎం జగన్ శంకుస్థాపన చేసిన శిలాఫలకం



ఊరందూరు లే అవుట్‌లో ఎటు చూసినా అసంపూర్తిగా కనిపిస్తున్న పక్కా ఇళ్లు

జిల్లాలో 2019-24 నడుమ పీఎం ఆవాస్ యోజన కింద 64,895 పక్కా ఇళ్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఐదేళ్లు గడిచేటప్పటికి కేవలం 26,855 ఇళ్లు మాత్రమే దాదాపు నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. వాటిలో కూడా చాలావరకూ ఫినిషింగ్ పనులు పెండింగ్ ఉన్నాయి. కొన్నింటిలోనే లబ్ధిదారులు నివాసం ఉంటున్నారు. 8,952 ఇళ్ల నిర్మాణం అసలు మొదలే కాలేదు.

574 లే అవుట్లలో ఒక్కటీ పూర్తికాని వైనం

జిల్లా వ్యాప్తంగా గత ప్రభుత్వం 574 లే అవుట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించి భూములు కేటాయించింది. అందులో 49,022 ఇళ్లు మంజూరు చేసింది. 7,843 ఇళ్ల నిర్మాణ పనులు మొదలే పెట్టలేదు. కేవలం 8,991 ఇళ్లు మాత్రమే నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. మిగతా ఇళ్లు వివిధ దశల్లో ఆగిపోయి ఉన్నాయి. వందశాతం లే అవుట్లు అసంపూర్తిగా ఉన్నాయి. కొన్ని లే అవుట్లు గ్రామాలకు మరీ దూరంగా, అనువుగాని చోట్ల కేటాయించడంతో లబ్ధిదారులు అడుగు కూడా పెట్టలేదు. ఆయాచోట్ల ముళ్లకంపలు పెరిగిపోయాయి. ఏ లే అవుట్‌లోనూ మౌలిక సదుపాయాలు కల్పించలేదు. మట్టి రోడ్లు, అరకొర విద్యుత్ స్తంభాల ఏర్పాటు తప్ప ఇతర సదుపాయాలు కనిపించడం లేదు.



నీళ్ల లీకేజీతో బురదమయంగా మారిన రోడ్డు

జగన్ శంకుస్థాపన చేసిన లే అవుట్ తీరిలా..

పేదలందరికీ జగనన్న ఇళ్ల పథకాన్ని 2020 డిసెంబరు 28న అప్పటి సీఎం జగన్ శ్రీకాళహస్తి మండలం ఊరందూరు సమీపంలో ప్రారంభించారు. ఆ సందర్భంగా శ్రీకాళహస్తి పట్టణ పేదల ఇళ్లకు ఊరందూరు వద్ద లే అవుట్‌కు శంకుస్థాపన చేశారు. 6,836 మందికి ఇళ్లు కట్టిస్తామని ప్రకటించారు. కానీ 5,086 మందికే పట్టాలిచ్చారు. అందులో 3,428 మందికే పక్కా ఇళ్లు మంజూరు చేశారు. మౌఖిక ప్రకటన ఆచరణకు వచ్చే సరికి 3,200 ఇళ్లు తగ్గిపోయాయి. మంజూరైన వాటిలోనూ 2,642 ఇళ్ల నిర్మాణమే మొదలైంది. వాటిలో 746 మాత్రమే పూర్తయ్యాయి. ఆ లబ్ధిదారుల్లోనూ కొందరే నివాసం ఉంటున్నారు. మౌలిక సదుపాయాలు లేవు. సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు లేవు. కొన్ని వీధుల్లో ముళ్ల పొదలు పెరిగిపోయాయి. జగన్ హామీ ఇచ్చిన శ్రీకాళహస్తి శాటిలైట్ టౌన్‌షిప్ దుస్థితిలో కొట్టుమిట్టాడుతోంది.

రాత్రిళ్లు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నాం!



కాలనీలో కనీస సౌకర్యాలు లేవు. అక్కడక్కడా పెట్టిన కొళాయిల నుంచీ తాగునీరు తెచ్చుకుంటున్నాం. తాగునీటి పైపులన్నీ పగిలిపోయి నీరంతా రోడ్లపైకి వస్తోంది. దాంతో మట్టి రోడ్లు బురదగా మారాయి. కాలనీలో కాపురాలు తక్కువ. ఎక్కడ చూసినా సగంలో ఆపేసిన ఇళ్లే. రాత్రయితే వాటిలోకి గంజాయి, మద్యం తాగేవారు వస్తున్నారు. ఆకతాయిల వల్ల రాత్రిళ్లు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నాం.

- గంగ, జగనన్న కాలనీ, ఊరందూరు



గూడూరు: రామలింగయ్య కాలనీ

గూడూరు మున్సిపాలిటీ రామలింగయ్య కాలనీలోని జగనన్న లే అవుట్‌లో 202 మందికి పక్కా ఇళ్లు మంజూరు చేశారు. 57 మాత్రమే నిర్మాణం పూర్తయ్యాయి. 65 పునాదుల దశలో ఆగిపోయాయి. మరో 83 బేస్‌మెంట్ దాటి వివిధ దశల్లో నిలిచిపోయాయి. మిగిలిన 71 అసలు పనులే మొదలు కాలేదు. సిమెంటు రోడ్లు, కాలువలు కనిపించవు. మొండిగోడలు, పునాదులకే పరిమితమైన ఇళ్లతో కాలనీ శిథిల వాటికలా కనిపిస్తోంది.

ముళ్లకంపల మధ్య కాపురముంటున్నాం!



చెన్నూరు రామలింగయ్య కాలనీ గూడూరు మున్సిపాలిటీలో ఉందన్న మాటేగానీ సౌకర్యాలూ లేవు. వర్షాకాలంలో మట్టి రోడ్లన్నీ బురదతో నిండిపోతున్నాయి. ఏ వీధిలో చూసినా ముళ్ల కంపలు, పొదలే. వాటి మధ్యే నివాసాలుంటున్నాం. గత ప్రభుత్వం ఇచ్చిన రూ.1.80 లక్షలు ఇంటి నిర్మాణానికి సరిపోలేదు. స్థోమత లేని చాలా మంది ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయలేక మధ్యలోనే వదిలిపెట్టేశారు.

- జిలానీ బాషా, రామలింగయ్య కాలనీ

బ్యాండ్‌పాలెంలో స్థలాలు చూపని వైనం

వెంకటగిరి మండలం సోమసానిపల్లి పంచాయతీ బ్యాండ్‌పాలెంలోని 18 మంది పేదలకు గత ప్రభుత్వం ఇళ్ల పట్టాలు.. ఇళ్లూ మంజూరు చేసింది. ఆ స్థలాలు ఎక్కడనేది మాత్రం చూపలేదు. అధికారులు, నాయకుల చుట్టూ తిరిగి తిరిగి అలసిపోయిన లబ్ధిదారులు ఆశలు వదిలేసుకున్నారు.

'చెన్నేరి'.. చేదు నిజాలు

సత్యవేడు మండలం చెన్నేరిలో 53 మంది పేదలకు గత వైసీపీ ప్రభుత్వం పక్కా ఇళ్లు మంజూరు చేసింది. నీటి సరఫరా, విద్యుత్, రోడ్లు వంటి కనీస సదుపాయాలు లేకపోవడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయలేకపోయారు. కాలనీలో 53 ఇళ్లకు గానూ ఒక్కటీ పూర్తి కాలేదు.

సత్యవేడు జగనన్న కాలనీది అదే కథ!

సత్యవేడులోని 350 మంది నిరుపేదలకు గత ప్రభుత్వం పట్టాలు.. ఇళ్లు మంజూరు చేసింది.అందులో200 మంది పనులు మొదలు పెట్టారు. ఐదేళ్లలో కేవలం 50 మాత్రమే పూర్త య్యాయి. వివిధ దశల్లో 150 నిలిచిపోగా మరో 150 ఇంతవరకూ మొదలే కాలేదు.



చిట్టడవిలా మారిన మంగళంపాడు జగనన్న లే అవుట్

మంగళంపాడులో అడుగుపెట్టని లబ్ధిదారులు

సూళ్లూరుపేట మండలం మంగళంపాడులోని ఎస్సీ పేదల కోసం గత ప్రభుత్వం కిలోమీటరు దూరంలో లేఅవుట్ ఏర్పాటు చేసింది. 44 మందికి పట్టాలు మంజూరు చేసింది. ఇళ్ల స్థలాలు కేటాయించింది. ఇళ్ల నిర్మాణానికి ఎలాంటి మౌలిక వసతులూ ఏర్పాటు చేయకపోవడంతో లబ్ధిదారులు ఆ లేఅవుట్‌లో ఇంతవరకూ అడుగు కూడా పెట్టలేదు. ముళ్లకంపలు, పొదలూ పెరిగిపోయి చిట్టడివిని తలపిస్తోంది.

గిరిజనులకు మిగిలింది గుడిసెలే!

సూళ్లూరుపేట మండలం మంగళంపాడు ఆత్రేయ గ్రామానికి చెందిన గిరిజనుల కోసం గత ప్రభుత్వం జగనన్న ఇళ్ల పథకం కింద కాలనీ మంజూరు చేసింది. గ్రామానికి చేరువలో లే అవుట్ ఏర్పాటు చేయాలని భూమి కేటాయించింది. 33 మందికి పట్టాలు మంజూరు చేశారు. అయితే ఇళ్ల నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ప్రస్తుతం అదే లే అవుట్‌లో లబ్ధిదారులైన గిరిజనులు గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారు.



రేకుల షెడ్డు వేసుకున్న లబ్ధిదారు



సూళ్లూరుపేట మండలం కేసీఎన్ గుంట పంచాయతీ దావాదిగుంట గ్రామంలో 13 మంది పేద ఎస్సీలకు పక్కా ఇళ్లు మంజూరు చేసింది గత ప్రభుత్వం. అంతా నిరుపేదలు కావడంతో పది మంది నిర్మాణాల జోలికే పోలేదు. ఇద్దరు మాత్రమే స్లాబ్ దాకా పనులు పూర్తి చేసి ఫినిషింగ్ చేయలేక వదిలిపెట్టేశారు.ఓ లబ్ధిదారుడు తనకు కేటాయించిన స్థలంలో రేకులతో తాత్కాలికంగా షెడ్డు వేసుకుని నివాసముంటున్నాడు.



తిరుపతి పేదలకూ తప్పని నిరాశ

తిరుపతి నగర పరిధిలోని పేదలకు ఏర్పేడు, చంద్రగిరి, వడమాలపేట, రేణిగుంట మండలాల్లో ఆరు లే అవుట్లు మంజూరు చేసింది. రేణిగుంట మండలం జీపాలెం గ్రామంలో 34 ఎకరాల లే అవుట్‌లో 1,753 పక్కా ఇళ్లు మంజూరు చేసింది. ఇప్పటికీ పది శాతం ఇళ్లు కూడా పూర్తి కాలేదు. ఎలాంటి సదుపాయాలూ కల్పించలేదు.

రేణిగుంట జీపాలెంలో ఇళ్ల పరిస్థితి



బంగారం దోపిడీ కేసులో మరో ఐదుగురి అరెస్టు

అవమాన భారంతో ఓ నిందితుడి ఆత్మహత్య

వి.కోట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా - తమిళనాడు రాష్ట్రాల సరిహద్దులోని నాయకనేరి అటవీ ప్రాంతంలో వారం రోజుల క్రితం జరిగిన బంగారం దోపిడీ కేసులో మరో ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ డి. ప్రభాకర్, సీఐ సోమశేఖర్ తెలిపారు. ఆదివారం సాయంత్రం చిత్తూరు జిల్లా వి.కోట మండలం నాయకనేరి అటవీ ప్రాంతంలో అనుమానాస్పద స్థితిలో కన్పించిన వారిని విచారించగా వారు బంగారం దోపిడీ కేసులో నిందితులుగా తేలడంతో అరెస్టు చేశామన్నారు. వారిలో తమిళనాడు రాష్ట్రం పేర్నాంబట్ సమీపంలోని కల్లిపేటకు చెందిన వేదాచలం(44), కుమరేశన్ (39), రంజిత్ (35), దీపన్ చక్రవర్తి (42), సూరవేల్ (48) ఉన్నారన్నారు. ఈ నెల 2వ తేది రాత్రి 8.45 గంటల ప్రాంతంలో కర్ణాటక రాష్ట్రం కేజీఎఫ్‌కు చెందిన దీపక్ కుమార్ అనే మార్వాడి వద్ద పనిచేసే చేతన్ కారులో బంగారం తీసుకెళ్తుండగా డ్రైవర్ ఇచ్చిన సమాచారం మేరకు అంతర్రాష్ట్ర ముఠా అడవిలో దారి కాచి కత్తులతో బెదిరించి కారులో ఉన్న బంగారాన్ని దోచుకెళ్లిన విషయం విదితమే.

నలుగురి కోసం గాలింపు...

ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే ప్రధాన నిందితులైన కేజీఎఫ్‌కు చెందిన కాంగ్రెస్ నేత సయపాల్‌తో పాటు కారు డ్రైవర్ ముకరం, బాబు, షణ్ముగంను అరెస్టు చేసి వారి వద్ద రూ. 3.2 కోట్ల విలువైన 3.5 కిలోల బంగారం కడ్డీలను రికవరీ చేశామన్నారు. తాజాగా ఐదుగురిని అరెస్టు చేశామని, మిగిలిన నలుగురి కోసం అన్వేషిస్తున్నామని డీఎస్పీ ప్రభాకర్ తెలిపారు. దోపిడీ కేసులో తాజాగా అరెస్టయిన నిందితులను పలమనేరు కోర్టుకు తరలిస్తుండగా వారి బంధువులు మాట్లాడేందుకు ఎగబడ్డారు. అయితే పోలీసులు వారిని వారించి నిందితులను కోర్టులో హాజరు పరుచగా న్యాయమూర్తి 14 రోజుల జ్యుడిషియల్ రిమాండు విధించారు. దీంతో నిందితులను మదనపల్లె జైలుకు తరలించారు.





బంగారం దోపిడీ కేసులో నిందితులను అరెస్టు చూపుతున్న డీఎస్పీ - ఆత్మహత్య చేసుకున్న ముద్దాయి అప్పు(ఫైల్‌ఫొటో)

స్నేహితుల వల్లే కేసులో ఇరుక్కున్నా

బంగారం దోపిడీ కేసులో నిందితుల్లో ఒకడైన అప్పు (28) తన స్వగ్రామమైన తమిళనాడు రాష్ట్రం పేర్నాంబట్ సమీపంలోని గుండ్లపల్లె వద్ద చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం ఉదయం గ్రామస్తులు గమనించి సమాచారమివ్వడంతో కుటుంబ సభ్యులు అతని మృతదేహాన్ని కిందకు దించారు. స్నేహితులు తనను సరదాగా తీసుకువెళ్లి దోపిడీ కేసులో ఇరికించారని, తన చావుకు వారే కారణమంటూ అతని సెల్‌ఫోన్‌లో రికార్డు చేసిన ఆడియో బయటపడింది. తమ బిడ్డ మృతికి కారణమైన స్నేహితులపై చర్యలు తీసుకోవాలంటూ కుటుంబ సభ్యులు డిమాండు చేశారు. ఈ కేసులో 8వ నిందితుడిగా ఉన్న అప్పు ఆత్మహత్య విషయాన్ని డీఎస్పీ ప్రభాకర్ వద్ద ప్రస్తావించగా అప్పు ఈ దోపిడీలో పాల్పంచుకున్నాడు కాబట్టే నిందితుడిగా చేర్చామన్నారు. అతడి ఆత్మహత్యతో తమకు సంబంధం లేదన్నారు.

డాక్టర్ అగర్వాల్ ఆప్టోమెట్రీతో వీఐటీ చెన్నై అవగాహన ఒప్పందం

చెన్నై, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయి నేత్ర సంరక్షణ విద్యా సంస్థగా పేరుగడించిన డాక్టర్ అగర్వాల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆప్టోమెట్రీ (డీఏఐఓ) నాణ్యమైన విద్యను అందించడంలో ఖ్యాతి గడించిన వీఐటీ చెన్నైతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ అవగాహన ఒప్పంద పత్రాలపై డీఏఐఓ డీన్ డాక్టర్ డి.కర్పగం, వీఐటీ చెన్నై ప్రోవైస్‌ఛాన్సలర్ డాక్టర్ టి.త్యాగరాజన్ సంతకాలు చేశారు. ఈ ఒప్పందం మేరకు రెండు సంస్థలకు చెందిన సుమారు 200 మంది విద్యార్థులు ఉమ్మడి పరిశోధనలు జరపడం, పరిశోధన పత్రాలు సమర్పించడం, నేత్ర సంరక్షణలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో మెరుగైన చికిత్సలందించటం వంటి కార్యక్రమాలను నిర్వర్తించనున్నారు. ఇదిలా ఉండగా డీఏఐఓ నేత్ర సంరక్షణ చికిత్సలకు సంబంధించి డిగ్రీ, మాస్టర్ డిగ్రీ కోర్సులకు సంబంధించి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని తెలిపారు. అడ్మిషన్ల వివరాలను నెం.9789060444, 944444821లకు ఫోన్ చేసి పొందవచ్చని నిర్వాహకులు తెలిపారు.



ఒప్పంద పత్రాలు ప్రదర్శిస్తున్న డీఏఐఓ ప్రతినిధులు, వీఐటీ చెన్నై నిర్వాహకులు

ఎమ్మెల్యేల నియోజకవర్గ అభివృద్ధి నిధులకు రూ.702 కోట్లు

పెరంబూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసన సభ్యులు తమ నియోజకవర్గాల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు రూ.702 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తూ జీవో జారీ చేసింది. ఆ ప్రకారం, 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఎమ్మెల్యేకు రూ.3 కోట్ల చొప్పున మొత్తం రూ.702 కోట్లు విడుదల చేసినట్లు సచివాలయం ప్రకటనలో తెలిపింది.